హైదరాబాద్ వార్త



# లష్కర్‌లో ప్రారంభమైన బోనాల జాతర సంబురాలు

-వీధి వీధిలో కొనసాగుతున్న ఘటోత్సవాలు
-బోనాల జాతర ఏర్పాట్లపై ముఖ్యశాఖల అధికారులు ముందస్తు రివ్యూ సమావేశాలు
-గల్లీల్లో ఘటానికి పూజలు చేసిన భక్తులు



**బేగంపేట జులై 3,ప్రభాతవార్త**

భాగ్యనగరంలో బోనాల జాతర సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి.తెలంగాణా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల ఉత్సవాలు నగరంలో నెల రోజుల పాటు అంగ రంగ వైభవంగా జరగనున్నాయి.డప్పు చప్పుళ్ళు, పోతు రాజుల హడావిడి,శివసత్తుల నృత్యాలు ఇలా బోనాల జాతరలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తున్నాయి.ఆషాడం లో వచ్చే అతి పెద్ద జాతర బోనాల జాతర.లష్కర్‌లో ఇప్పటికే ఘటోత్సవం ప్రారంభమైంది.ప్రతి రోజు ఘటం ఉదయం శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం నుంచి బయలు దేరి ప్రతి రోజు ఒక ప్రాంతంలో భక్తులకు దర్శనం ఇచ్చి తిరిగి ఆలయానికి చేరుకుంటుంది.ఆషాడ మాసం అమ్మ వారికి ఎంతో ప్రీతి పాత్రం కావడంతో భక్తులు అమ్మ వారికి బోనాలు,సాక,ఒడిబియ్యం సమర్పించి అమ్మ వారికి మొక్కులు చెల్లించుకుంటారు.జూన్ 26న చారిత్రాత్మక గోల్కొండ కోటలోని శ్రీజగదాంబిక అమ్మ వారికి మొదటి బోనం సమర్పించడంతో బోనాల సంబురాలు ప్రారంభమయ్యాయి.రెండవ వారం జులై 6వతేదీన ఆదివారం బల్కంపేట రేణుక ఎల్లమ్మ గుడిలో బోనం ఎత్తుతారు.మూడవ వారం జులై 13వ తేదీన లష్కర్ లోని సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో బోనం ఎత్తుతారు.నాలుగవ వారం జులై 20వ తేదీన ఆదివారం లాల్ దర్వాజాలోని శ్రీమహంకాళీ ఆలయంలో బోనం ఎత్తుతారు.ఆషాడ మాసంలో ప్రతి ఆదివారం,గురువారం మొత్తం తొమ్మిది రకాల పూజలను అమ్మ వారు అందుకుంటారు. బోనాల సందర్భంగా జూన్ 26వతేదీన గురువారం మొదటి బోనం,జూన్ 29వ తేదీ ఆదివారం రెండవ బోనం,జులై 3వతేదీ గురువారం మూడవ బోనం,జులై 6వతేదీ నాలుగవ బోనం,జులై 6వతేదీన ఆదివారం నాలుగవ బోనం,జులై 10 గురువారం ఐదవ బోనం,జులై 13వతేదీ ఆదివారం ఆరవ బోనం,జులై 17వతేదీ గురువారం ఏడవ బోనం,జులై 20వతేదీ ఆదివారం 8వ బోనం,జులై 24వతేదీ గురువారం తొమ్మిదవ బోనం నిర్వహించనున్నారు.దీంతో బోనాల ఉత్సవాలు ముగుస్తాయి.ఇప్పటికే తెలంగాణా ప్రభుత్వం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా,ఘనంగా నిర్వహించేందుకు అన్ని ముఖ్య శాఖల అధికారులతో పలు మార్లు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేసారు.ఇప్పటికే ఆలయాలను రంగులు వేసి అందంగా ముస్తాబు చేసారు.సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో 13న బోనాలు,14న రంగం(భవిష్యవాణి) ,అంబారీ ఊరేగింపులను దృష్టిలో ఉంచుకొని ఆలయం వద్ద అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.మహాకాళీ అమ్మ వారి బోనాల జాతరకు అమ్మ వారిని రెండు తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్య మంత్రులు,కేంద్ర మంత్రులు,మంత్రులు, ఎమ్మెల్యేలు, పోలీసు,ఇతర శాఖల ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్శించుకునే అవకాశం ఉంది.వీరితో పాటు దేశ విదేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉంది.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ఆలయం వద్ద చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలపై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వివిధ ముఖ్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలపై సూచనలు చేసారు.ఈ మేరకు అధికారులు ఆలయంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేస్తున్నారు.

**బోనం.....**

ప్రజలందరినీ రక్షించే అమ్మ వారికి మర్యాద పూర్వకంగా వందనం సమర్పణ చేయడమే బోనం.అందరినీ కలరా,మశూచి సకల రోగాల నుంచి రక్షించే తల్లికి నివేదన చేయడమే బోనం. బోనం అంటే భోజనం.అమ్మకు పెట్టే నైవేద్యం. ప్రతి ఆషాడ మాసంలో వర్షాలు కురిసి వ్యాధులు విజృంభిస్తుంటాయి.అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మొదలు పెట్టేది కూడా ఇదే సమయం.తమ పిల్లా పాప,గొడ్డు,గోదా,పాడి పంటా చల్లగా కాపాడు తల్లీ అంటూ భక్తులు అమ్మ వారికి సాక సమర్పించి,బోనాలు సమర్పించడంతో పాటు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.అమ్మ వారికి అత్యంత భక్తి శ్రద్దలతో సమర్పించే నైవేద్యమే బోనం.ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి బోనం ఎత్తుకుని మేళ తాళాలు డప్పుచప్పుళ్లు,పోతురాజుల హంగామాతో అత్యంత భక్తి శ్రద్దలతో తరలి వెళ్లి అమ్మ వారికి బోనం సమర్పిస్తారు.బోనాల జాతరలో బోనానికి ఎంతో ప్రత్యేకత ఉంది.ఆషాడ మాసంలో కురిసే వర్షాల వల్ల అంటురోగాల నివారణకోసం క్రిమి కీటకాలను,వైరస్‌లనునిర్మూలించే వేపాకు, పసుపు, నిమ్మ కాయలు,కుంకుమ, పసుపు, గుగ్గిలం, సాంబ్రాణీ,అగర్‌బత్తీలు, కర్పూరం,కొబ్బరి కాయలు వంటి పదార్థాలను వాడుతారు.బోనాన్ని ఎంతో పవిత్రంగా తీసుకు వచ్చి అమ్మ వారికి సమర్పిస్తారు భక్తులు.ఏటేటా శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాల జాతరకు దేశ,విదేశాల తో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకుంటారు.

# 'కలెక్షన్' బాయ్స్..రేపటి నేరస్తులు!

- అప్రమత్తం లేకపోతే భారీస్థాయిలో నష్టాలు
- అధికశాతం డబ్బులు చూస్తే దోపిడి పథకం
- ఇటీవల నాలుగైదు ఘటనలు
- రూ.లక్షల్లో నష్టపోతున్న ఆర్థికవ్యాపారస్తులు
- ప్రమాదనాటకంగా మరొకటి



**హైదరాబాద్,జులై3, ప్రభాతవార్త:** అప్పటి వరకు బాగానే ఉంటారు..ఎలాంటి ఆలోచనలు రావు... కానీ ఎప్పుడు చూడని భారీస్థాయిలో డబ్బులు ఒకేసారి చేతిలో కనిపిస్తే మనస్సు కొత్త ఉత్సాహంతో ఉరకలేస్తాయి. దీంతో కొత్తఆలోచనలు మనస్సును కలవరపెట్టడంతో దురాశ అలజడితో దోపిడి పథకాలకు తెరలేపుతున్నారు. సాదాసీదా ఉద్యోగులు మాదిరిగానే ఆయా ఆర్థిక కంపెనీలు నియమించడంతో దొంగలుగా మారి జైల్లో ఊచలు లెక్కిస్తున్నారు. నగరంలో గత రెండు నెలల్లో నాలుగైదు ఘటనలు ఆర్థికలావాదేవీలవే. ఇటీవల మరొకటి ప్రమాదనాటకీయ పరిణామంగా చోటు చేసుకుంది. రూ.17లక్షలు చూడగానే దుర్బుద్ధి కలవరపెట్టింది. ఇంకేముంది...అంబర్‌పేటలో ప్రమాదం జరిగిందని నాటకమాడి అటూ సదరు యజమాని..ఇటూ పోలీసులకు చెప్పి మోసం చేయాలనుకున్న స్కెచ్ బెడిసికొట్టి జైలు పాలయ్యాడు. ఒక్కటేంటి ఎన్నో ఘటనలు ఉన్నాయి. నగదు లావాదేవీల్లో అప్రమత్తమే అవసరమని మానసికవైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెక్యూరిటీ భద్రత చాలా ముఖ్యమని ఆర్థికవేత్తలు, పోలీసులు సైతం సూచిస్తున్నారు.అనధికారంగా చేపట్టే చిట్‌ఫండ్స్,ఫైనాన్సియర్స్ మరెనెకన ఉన్నా..పోలీసుల వరకు చేరడం లేదనే తెలుస్తోంది. అంతర్గతంగా సమస్యలను పరిష్కరించుకుంటున్నారు.

**ఎన్నో ఘటనలు..అదే నిర్లక్ష్యం..**

నగరంలో కలెక్షన్ బాయ్స్ ఎన్నో ఆర్థిక మోసాలు జరుగుతున్నా అదే నిర్లక్ష్యంతో వ్యాపారాలు చేస్తున్నారు. ఏదైన ఘటనలు జరిగితేనే లబోదిబోమంటూ ఫిర్యాదులు చేస్తున్నారు. రెండునెలల్లోనే నాలుగు ఘటనలు వివిధ రకాలుగా జరిగాయి. వీరి గుర్తింపు కార్డులు,ఆధారాలేమి లేకుండా ఉద్యోగాలకు నియమించుకున్నారు. ఫలక్‌నుమాకు చెందిన ఓ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ జ్యువెలరీ యజమాని వద్ద నమ్మకంగా పనిచేస్తున్నాడు. అయితే ఒకేసారి రూ.7లక్షలు చూడడంతో దుర్బుద్ధి పుట్టి డబ్బులతో పరారయ్యాడు. పంజాగుట్టలోని ఓ బ్యాంకు ఎజెన్సీ సంస్థలో కలెక్షన్‌బాయ్‌గా పని చేస్తున్న వ్యక్తి రూ. రికవరీ చేసిన వారితో వచ్చిన రూ.4.7లక్షలు తీసుకొని పారిపోయాడు. అతని కుటుంబంలో ఉన్న అప్పుల్లు కట్టి మిగత సొమ్ముతో బైక్ కొనుగోలు చేశాడు. అదే విధంగా సికింద్రాబాద్ లాలాగూడ ప్రాంతంలో అనధికారికంగా నిర్వహిస్తున్న చిట్టీల వ్యాపారంలో ఇరవై మందితో వసూలూ చేసిన డబ్బు రూ. 3.5లక్షలతో ఉడాయించాడు. ఇలా ఎన్నో ఘటనలు చేసుకుంటున్నాయి. ఆర్థికవ్యాపారులు చేసేవారు సుమారు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఆర్థిక పరమైన నిబంధనలు పాటించకపోవడంతోనే మోసాల ఘటనలు జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. సీసీకెమెరాలతోనే నిందితులను గుర్తించి కొంత రికవరీ చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

**సెక్యూరిటీ డిపాజిట్‌తోనే 'నమ్మకం'..**

డబ్బుల లావాదేవీల ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాల్లో సెక్యూరిటీ డిపాజిట్ ముఖ్యమని పోలీసులు చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు అధికస్థాయిలో డబ్బుల వసూళ్లలో తెలిసినవారినే నియమించుకోవాలని, లేదంటే ప్రభుత్వ గుర్తింపు కార్డులు, అడ్రస్సుల తనిఖీ చేసి నమ్మకమైన వారినే ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా డబ్బులపై ఎలాంటి వ్యామోహం లేని వారు, ఆర్థిక సమస్యలు లేని వ్యక్తులతోనే సమస్యలు ఉండవని ఆర్థికనిపుణులు పేర్కొంటున్నారు. వ్యవహారశైలీ కూడా చూడాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా ఒకరికే రూ. 5,10లక్షల వసూళ్లు ఉండకూడదని, లేదంటే ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు వెంట ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఏటీఎంల్లో డబ్బులు డిపాజిట్ చేసే ఏజెన్సీలే నల్గురు ఐదుగురు వ్యక్తులు ఉంటారు.

# చిన్నారుల సంరక్షణ ధ్యేయంగా 'ఆపరేషన్ ముస్కాన్ '

-బాలకార్మికులు, బిక్షాటన, వెట్టిచారికి నుంచి విముక్తి
-25 బృందాలతో ఈనెల 30వరకు క్యాంపెయిన్
-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్, జూలై 3,ప్రభాతవార్త:**

చిన్నారుల సంరక్షణ ధ్యేయంగా ఆపరేషన్ ముస్కాన్ సాగాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని బాల కార్మికులు, చిన్నపిల్లలచే బిక్షాటన, వెట్టిచాకిరీల నుంచి చిన్నారులకు విముక్తి కల్పించి, పునరావాస కేంద్రాలలో రక్షణ కల్పించడమే ముస్కాన్ ఉద్దేశమని తెలిపారు. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆపరేషన్ ముస్కాన్‌పై పోలీస్, రెవెన్యూ, కార్మిక, వైద్య ఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ శాఖ, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి చర్చించారు. అలాగే డిసిపి లావణ్య, అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలసి చేపట్టాల్సిన విధానాలు పై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30 వరకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుందని ఇందుకు జిల్లాలో 25 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బాల కార్మికులు, పిల్లలతో బిక్షాటన, వెట్టిచాకిరి చేసే చిన్నారులను, అనాథ పిల్లలను గుర్తించి, వారిని పునరావాస కేంద్రాలల్లో గానీ తల్లిదండ్రులకు అప్పగించుటలో అనుబంధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయతో పనిచేయాలన్నారు. హైదరాబాద్ మహానగరం అయినందున, వివిధ ప్రాంతాల నుంచి పిల్లలు వచ్చే ఆస్కారం ఉందని బస్టాండ్‌లలో, రైల్వే స్టేషన్లో, పారిశ్రామికవాడలలో, పరిశ్రమలలో బాల కార్మికులు పనిచేసే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిలన్నారు.పరిశ్రమలలో బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని పనిలో పెట్టుకున్న యజమానులపై నిబంధనల ప్రకారము కేసులు నమోదు చేయాలని సూచించారు.అలాగే ప్రతి ఒక్కరి వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. కేంద్రాలలో చేర్పించిన పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యం అందించాలన్నారు. అంతేకాకుండా వారికి ఆధార్ కార్డులు హెల్త్ ,కుల సర్టిఫికెట్లు జారీ చేసి వారికి విద్యను అందించేందుకు సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గతంలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా కనుగొన్న చిన్నారుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు వివరించారు. ఈ సమావేశంలో సిడబ్ల్యుసి ఛైర్మన్ శైలజ, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బి.జాసన్, డిఈఓ రోహిణి, డీసీపీ ఓ శ్రీనివాస్, తహసిల్దార్లు,జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాలాలు పొంగకుండా శాశ్వత పరిష్కారం : ఎ.వి రంగనాథ్

**హైదరాబాద్, జూలై 3,ప్రభాతవార్త:**

నాలాలు పొంగకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు సూచించారు. నాలాలకు ఉన్న ఆ టంకాలన్నీ తొలగితే చాలా వరకు ముంపు సమస్య తలెత్తదన్నారు. వర్షాల వేళ.. నగరంలోని పలు ప్రధాన నాలాలు, ముంపు ఉన్న ప్రాంతాల ను హైడ్రా కమిషనర్ గురువారం పరిశీలించారు. నాలా ఆక్రమణలను ప్రత్యక్షంగా చూసి వెంటనే తొలగించడానికి ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు పడినప్పుడు మూసీ నదీ పరీవాహకం కంటే.. ఎక్కువ కూకట్‌పల్లి, జీడిమెట్ల నాలాలే ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రహించామ న్నారు. ఈ రెండు నాలాలు సాఫీగా సాగకపోవ డంతో భరత్‌నగర్, మూసాపేట, బాలానగర్, జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్, వినాయక్‌నగర్, కల్యాణ్ నగర్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని.. ఈ ఏడాది ముప్పు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

**సగానికి పైగా కబ్జాలకు గురైన నాలాలు..**

జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ నుంచి వచ్చే వరద కాలువ ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై కుంచించుకుపోయిన విషయాన్ని రంగనాథ్ క్షేత్ర స్థాయి లో పరిశిలించారు. ఫాక్స్ సాగర్ అలుగు కాలువ ఆనవాళ్లే లేకుండా పోయిం దని జీడిమెట్ల ప్రాంతంలో ఆ కాలువ 30 మీటర్ల వెడల్పులో ఉంటే.. కల్వర్టుల వద్ద ఉన్న వెడల్పు కాలనీలు, బస్తీలకు వచ్చేసరికి లేకుండా పోయింది. బాలానగర్ జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్ కల్వర్టు కింద 22 మీటర్లు వెడల్పుతో ఉన్న నాలా.. బస్తీలకు వచ్చే సరికి 10 మీటర్లకు పరిమితమైందన్నారు. వాస్తవానికి 22 మీటర్ల వెడల్పు, నాలాకు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్‌ని కలిపి మొత్తం 40 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా 10 మీటర్లకు పరిమితమవ్వడంతోనే జీడిమెట్ల నాలా పొడు గునా.. ఫతేనగర్, బాలానగర్ బస్తీలన్నీ నీట మునుగుతున్నాయని గుర్తించారు. వెంటనే జీడిమెట్ల నుంచి వచ్చే ఈ నాలాను డ్రోన్ కెమేరా తో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అధికా రులను కమిషనర్ ఆదేశించారు. ఫాక్స్‌సాగర్ చెరువు కిందన నాలాలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలన్నారు. అలాగే అల్వాల్ మండలం యాప్రాల్ లో నాగిరెడ్డి కుంట కబ్జాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు 19 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు 6ఎకరాల వరకూ కబ్జాకు గురైందని గ్రహించారు. చెరువు గర్భంలో పోసిన మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగిరెడ్డి కుంట నుంచి కాప్రా చెరు వుకు వెళ్లాల్సిన వరద కాలువలు ఎక్కడికక్కడ దారితప్పడంతో పాటు.. కబ్జాలకు గురి కావడాన్ని కమిషనర్ పరిశీలించారు. గోల్ఫ్ ఫ్రైడ్ హోమ్స్, మల్బార్ గీన్స్ విల్లాస్, హరిప్రియనగర్, గోల్ఫ్ వ్యూ ప్యారడైజ్, స్వర్ణాంధ్ర ఫేజ్ 01, 02 ఇలా పలు గేటెడ్ కమ్యూనిటీలలో వాగులు రూటు మారడాన్ని పరిశీలించారు. నాలా ఆరంభంలో ఎంత వెడల్పులో ఉందో.. కాప్రా చెరువులో కలిసే వరకూ అదే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడి వివిధ కాలనీ వాసులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి.. గతంలో నాలాలు ఏ మార్గంలో వెళ్లేవి.. ఇప్పుడు వాటిని పునరుద్ధరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు.. యాప్రాల్‌లోని స్వర్ణాంధ్ర ఫేజ్ 01కు వరద ముప్పును తప్పించే కాలువ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేశారు. మధ్యాహ్నం పరిశీలించగా.. ఆవెంటనే హైడ్రా సహకారంతో మల్కాజిగిరి సర్కిల్ అధికారులు పనులు ప్రారంభించి పూర్తి చేశారు.


వరదముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ ఎ.వి రంఘనాథ్

# భక్తి శ్రద్దలతో జగదాంబ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

-గోల్కొండలో కొనసాగుతున్న బోనాల ఉత్సవాలు


గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి మూడవ పూజ

**మెహిదీపట్నం, జులై 3, ప్రభాతవార్త :**

చారిత్రాత్మక గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆధ్యాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొన సాగుతున్నాయి. భక్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు, తొట్టెలలను సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకుంటున్నారు. ఆషాడ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా గురువారం శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి మూడవ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి పటం వేసి ప్రత్యేక పూజలు చేశారు. పలు బస్తీల నుంచి తీసుకొచ్చిన బోనాలతో పాటు తొట్టెలను అమ్మవారికి సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలతో కోట ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. గోల్కొండ తహసిల్దార్ అహల్య, జిహెచ్ఎంసి కార్వాన్ 13 సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ లు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో దేవాలయ చైర్మన్ కొండెపూడి చంటిబాబు, కమిటీ సభ్యులు ఎరుకల సంతోష్ కుమార్ గౌడ్, ఈ.వో వసంత స్థానిక నేతలు ఆకుల చంద్రశేఖర్, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ సభ..రోశయ్య విగ్రహావిష్కరణ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, జులై3, ప్రభాతవార్త:** ఎల్‌బీస్టేడియంలో కాంగ్రెస్ సభ, సైఫాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ నేపథ్యంలో శుక్రవారం ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు, ఆంక్షలు, జంక్షన్లు మూసివేత ఉంటుందని నగర సీపీ సీవీ.ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ సందర్భంగా మధ్యాహ్నం 1నుంచి రాత్రి 8గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని వివరించారు. పబ్లిక్‌గార్డెన్ నుంచి వాహనాలను నాంపల్లి ఏఆర్ పెట్రోల్‌బంక్ సమీప దారిలోకి మళ్లించనున్నారు. అదేవిధంగా బషీర్‌బాగ్ నుంచి వచ్చే వాహనాలను బీజేఆర్ విగ్రహం, అబిడ్స్ ఎస్బీఐ,నాంపల్లి స్టేషన్‌రోడ్డులో వెళ్లాలి. సుజాత స్కూల్ దారిలో వచ్చే వాహనాలు స్కూల్ జంక్షన్ దారికి మళ్లించారు. అదేవిధంగా వీవీ విగ్రహం, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి ఫ్లైఓవర్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో వాటిని మధ్యాహ్నం 2 నుంచి 8గంటల వరకు ఆంక్షలు ఉంటాయన్నారు. ఆర్టీసీ బస్సులు కూడా రవీంద్రభారతి నుంచి వచ్చే బస్సులు ఏఆర్‌పెట్రోల్ బంక్ మీదుగా రాకపోకలు సాగించాలి.

**రోశయ్య విగ్రహావిష్కరణ సందర్భంగా...**

సైఫాబాద్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ కారణంగా ఉదయం 8గంటలకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.సెక్రెటేరియట్ నుంచి వచ్చే వాహనాలు రవీంద్ర భారతి సమీపానికి మళ్లించారు. సైఫాబాద్ నిరాంకరి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్, లక్డీకాపూల్ పాత బ్రిడ్జిమీదుగా వెళ్లాలి.

# వాహనాల షెడ్ పరిశుభ్రంగా ఉండాలి

-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్


వాహన మరమ్మత్తుల షెడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, జులై 3,ప్రభాతవార్త:**

వాహనాల మరమ్మత్తుల షెడ్ పరిశుభ్రంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కవడిగూడ వాహనాల మరమ్మతు షెడ్ ను పరిశీలించి వాహనాల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఖైరతాబాద్ వాహన పార్కింగ్ షెడ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. మొబైల్ టాయిలెట్ వాహనాలను రిపేర్ చేసి వాడుకలోకి తేవాలన్నారు. అవసరమైన సమయంలో వాడుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.కమీషనర్ వెంట అడిషనల్ కమీషనర్ ట్రాన్స్ పోర్ట్ రఘు ప్రసాద్, జోనల్ కమీషనర్ రవి కిరణ్, జూబ్లీహిల్స్ సర్కిల్ 18 ఈఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రబ్బర్ కంపెనీలో అగ్నిప్రమాదం



**అత్తాపూర్ జూలై 3, ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ పరిశ్రామిక వాడలోని శివం రబ్బర్ కాంపెనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది.గురువారం సుమారు 5 గంటల సమయంలో శివం రబ్బర్ కంపెనీలో షార్ట్‌సర్క్యూట్‌తో ఒకసారిగా మంటలు చేలరేగి దట్టమైన పొగ అలుముకుంది.సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అర్పి అదుపులోకి తీసుకువచ్చారు.ప్రమాదం జరిగిన కంపెనీలో రబ్బరు చెప్పులు తయారవుతాయని పేర్కొన్నారు.తెల్లవారుజామున స్థానికులందరూ నిద్రలో ఉండగా ఒక్కసారిగా మంటలు ,పొగ రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## ఆంధ్రా కులాలను బిసి జాబితాలో కలపొద్దు

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

**ముషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** తెలంగాణలో తొలగించిన 27 ఆంధ్రా కులాలను బీసీ జాబితాలో కలపవద్దని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. ఆంధ్రా కులాలను తిరిగి బీసీ జాబితాలో కలిపితే తెలంగాణ బీసీలకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి బీసీలకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు డాక్టర్ భాగయ్య, గడప శ్రీహరి, కంటే రామచందర్, మల్లేష్, కొమరయ్య, అంబటి సుధాకర్ గంగపుత్ర పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌ను కలిసిన బండి రమేష్



కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో మాట్లాడుతున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జులై 3, ప్రభాతవార్త**

టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ గురువారం కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను మూసాపేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వర్షాకాలం వరదలను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని సూచించారు.

## అధికారులు అంకితభావంతో పనిచేయాలి

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్




జీహెచ్ఎంసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాబోయే బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క అధికారి అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో కలసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, వీధి దీపాల సమస్యలు ఎక్కడ ఉన్నా తక్షణమే మరమ్మత్తులు చేయాలని, అవసరమైతే కొత్త వాటిని ఏర్పాటుచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటి మున్సిపల్ కమీషనర్ మారుతి దివాకర్, అసిస్టెంట్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హేమలత, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంతి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలోకి టిఆర్ఎస్ (డి)



సమావేశంలో మాట్లాడుతున్న నరాల సత్యనారాయణ

**సైఫాబాద్, జులై 3 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (డి) అభ్యర్థిని ఎన్నికల భరిలోకి దించుతామని సమితి తెలిపింది. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ పోటీ చేసే అభ్యర్థి కంచర్ల మంజుష పేరును కూడా ప్రకటించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమ పార్టీకి 5 వేలమంది సభ్యత్వం ఉందని, ఇంకా కొనసాగుతున్నదని, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర చేపడతామన్నారు. విద్యావంతురాలైన కంచర్ల మంజుషకు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, రాజకీయ నేపథ్యం కుటుంబం నుంచి వచ్చిన ఆమె తమ పార్టీలో కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా కొనసాగుతున్నదని చెప్పారు. బనకచర్ల లింకు ప్రాజెక్టుపై ఈ నెల 19న తేదీన తమ పార్టీ ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నదని, ఏపి ప్రభుత్వం 200 టిఎంసి గోదావరి జలాలను కృష్ణ బెసిన్ మీదగా పెన్నా బెసిన్‌కు మళ్లించేందుకు గోదావరి–బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు 80 వేల కోట్లతో చేపడుతున్నదని ఆరోపించారు. 3వేల టిఎంసి నికర జలాలను ఉపయోగించుకుంటే రాష్ట్రంలో 4 పంటలు పండించుకోవచ్చునని సూచించారు. మంజుష మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పారు. తెలంగాణ ప్రజలకు రక్షన కల్పించే పార్టీ తమదేనన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరావుని కలిసిన స్వామి ముదిరాజ్



**పేట్ బషీరాబాద్, జులై 3, ప్రభాతవార్త**

తెలంగాణ ముదిరాజ్ మహాస రాష్ట్ర కార్యదర్శి గుమ్ముల స్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రి తూముల నాగేశ్వరరావుని కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ముదిరాజ్ మహాసభ సభ్యులు గుమ్మడి మధుసూదన్ రాజు, పెంటయ్య, రమేష్, నరేందర్, నరసింహ, వెంకటేష్, చెన్నయ్య ముదిరాజ్, శివ, నరసింహ, సూర్యనారాయణ బంధుమిత్రులతో కలిశారు.

## భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద వేదాలు : డా. కె.వి.రమణాచారి



ఋగ్వేదానికి రాహుల్ గ్రహణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, పద్మనాభరావు, రఘురామ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూలై 3 ప్రభాతవార్త :** భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద వేదాలని, అవి మన జ్ఞానానికి మూలం... వాటిని లోతుగా పరిశీలించి అధ్యయనం చేయాలని తద్వారా ఆధ్యాత్మిక, మానసిక వికాసశక్తి పెరుగుతుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఢిల్లీ దూరదర్శన్ పూర్వ అదనపు డైరెక్టర్ డా. రేవూరి అనంత పద్మనాభరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు మల్లం వీరేందర్, సవరం వెంకటేశ్వరరావు, డా. వి.ఎ.కుమారస్వామిశాస్త్రి, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో ప్రముఖ రచయిత డా. చిట్టావూరి శివరామకృష్ణశర్మ రచించిన ఋగ్వేదానికి రాహుల్ గ్రహం గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. దేశాన్ని మొగల్ చక్రవర్తులు, అనంతరకాలంలో బ్రిటిష్‌వారు పాలించిన సమయంలో అత్యంత విలువైన భారతీయ వేదాలు, వైద్య విజ్ఞానశాస్త్రాలు వక్రీకరణ జరిగాయన్నారు. రచయిత తన ఆంగ్ల గ్రంథంలో మనదేశ వాస్తవిక చరిత్ర మార్పులుతో వక్రీకరణకు గురైన వివరాలు సహేతుకంగా వివరించారన్నారు. అలాగే రాహుల్ సాంకృత్యాయన్ ఋగ్వేదంపై చేసిన వక్రవ్యాఖ్యానాలను శర్మ తన తెలుగు గ్రంథంలో తీవ్రంగా ఖండించారని తెలిపారు. రచయిత తన స్పందనలో సత్యాన్ని సమాజం ముందు ఉంచాలనే ప్రయత్నం చేస్తున్నానని స్పష్టం చేశారు.

## కొలకలూరి ఇనాక్ సాహిత్యం మానవీయతకు ప్రతీకలు : ఏనుగు నరసింహా రెడ్డి



కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 3 ప్రభాతవార్త:** కొలకలూరి ఇనాక్ దళిత వాద సాహితీ వేత్త గా భావిస్తారు అని, కాని ఆయన అణగారిన వర్గాల పక్షపాతి అని ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. ఆయన సాహిత్యం మానవీయతకు ప్రతీకలు అని ఉదహరించారు. గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వాహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహం లో భాగంగా డాక్టర్ అరుణ గంధం రచించిన కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఏనుగు నరసింహా రెడ్డి పాల్గొని సంపుటి నీ ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు సాహిత్యంకు మంచి కానుక అరుణ అందించిన ఇనాక్ సాహిత్యం పై వ్యాస సంపుటి అని అభినందించారు. సినీ కళాకారులకు అభిమాన సంఘాలు వుంటాయని, కానీ ప్రజా చైతన్యం కోసం జీవితమంతా కృషి చేసే సాహితీ కారులకు అభిమాన సంఘాలు లేక పోవటం విచార కరం అన్నారు. గాన సభ వారు ఏడు సంవత్సరాలు గా ఇనాక్ సాహితీ సప్తహం నిర్వహిస్తూ ఆయనకు అభిమాన సంఘంగా మారారని అభివర్ణించారు. ఇనాక్ కు జ్ఞాన పీఠం ఇంకా రాకున్నా దానికన్నా ఎత్తు పీఠంకు ఎదిగిన సాహితీ ఋషి అని చెప్పారు. ప్రముఖ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి ఉద్యమ నేపథ్యం లో ఇనాక్ సాహితీ సృజన ఉందని అన్నారు. ఆయన సాహిత్యం స్వతంత్ర భారతీయ ఆత్మను ప్రతిబింబిస్తుందన్నారు. దళిత వాదం కన్నా మానవీయ చైతన్యం కాలం భావ జాలాన్ని గ్రహించడం ఇనాక్ సాహిత్య నేపథ్యం అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై నాట్య గురువు రేణుకా ప్రభాకర్, కిన్నెర రఘురాం, గంధం అరుణ, ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు

## సాయిబాబా ఆలయం వద్ద గోశాల ఏర్పాటుకు సహకరిస్తా

### - మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి



హైదర్షాకోట్ రఘురాంనగర్ కాలనీలో సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి.

**నార్సింగి, జూలై 3 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్ రఘురాంనగర్ కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో గోశాల నిర్మాణంకు నావంతు పూర్తి సహకారం అందిస్తానని మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయిబాబా ఆలయంలో కాంగ్రెస్ నాయకులు టింకురెడ్డి, నర్సింగ్‌రావ్, కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని తెలిపారు. ఆలయాల వద్ద ఉన్న ధ్వజస్థంభం, గర్భగుడి పైనున్న శిఖరాలు అంతరిక్షంలోని శక్తిని గ్రహించి ఆలయం లోపల, ఆవరణలో నిక్షిప్తం చేస్తాయన్నారు. దీని కారణంగానే ఆలయాలకు వెళ్లే భక్తులకు శారీరక, మానసిక అలసట తీరి, ప్రశాంతత లభిస్తుందన్నారు. సనాతర ధర్మంను ఆచరించే ప్రతీ ఒక్కరూ తమ బిడ్డలను విధిగా ఆలయాలకు తీసుకెళ్లాలని, మన ధర్మంను మనం భక్తిశ్రద్ధలతో ఆచరిస్తూ, ఇతరుల మతాలను గౌరవించాలని సూచించారు. ఈ లోకంలో సర్వేజనః సుఖినోభవంతు అని కోరుకునేది సనాతన ధర్మంను ఆచరించే వారు మాత్రమే అన్నారు. మన ఆరోగ్య పరిరక్షణ కోసం, ఆధ్యాత్మిక వికాసానికి, ప్రకృతి పరిరక్షణకు మన మహర్షులు అనేక సదాచారాలు, పద్ధతులు పెట్టారన్నారు. గోవులో ముక్కోటి దేవతలుంటారని, గోవును నిత్యం పూజించి ఏ పని చేసినా దిగ్విజయంగా పూర్తవుతుందని, గోవు పేడ, మూత్రంతో సేంద్రీయ ఎరువులు తయారు చేసి పండించిన ఆహార ధాన్యాలను తీసుకుంటే సకల రోగాలు దూరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆగస్టు 21న 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ 'అవార్డులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వసుంధర, సిమి,ప్రణీత, నవీన్, శ్రవణ్ తదితరులు

**హైదరాబాద్,జూలై 3,ప్రభాతవార్త:**

హైదరాబాద్ అభివృద్ధికి పాలుపంచుకొంటూ రియల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నసామాన్యులకు ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ అవార్డ్స్ 2025 అందిస్తున్నట్లు గుర్తింపు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పుల వసుంధర తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించి మీడియాతో మాట్లాడుతూ తమ అవార్డులు తీసుకున్న వారికి ఉచిత బ్రాండింగ్, మార్కెటింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గుర్తింపు ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఇప్పటికే ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించినట్టు చెప్పారు. విద్యార్థుల స్టార్టప్ వివిధ అంశాలలో ఆప్ స్కిల్, ఇంకుటేషన్, ప్రభుత్వం తరపున ఫండింగ్ సపోర్టు అందిస్తామని తెలిపారు. 18–30 ఏళ్ల వయసున్న స్టూడెంట్స్, ఇన్నోవేటర్స్, స్టార్టప్ కాంపిటీషన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27లోపు ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ అవార్డు నామినేషన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని ఆగస్టు 21న జరిగే ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఈవెంట్లో విజేతలకు రూ.లక్ష బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. సమావేశంలో ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు సిమి ప్రణీత, నవీన్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావును కలిసిన బిజెపి నాయకులు



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రారావును సన్మానిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి,జూలై 3 ప్రభాతవార్త :**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన ఎన్.రామచంద్రరావును గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇం ఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రామ చంద్రరావుకు పుష్ప గుచ్చం అంద జేసి శాలువతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ అధ్యక్షులు అడికె జనార్దన్. బిజెపి నాయకులు నర్సి రెడ్డి, శ్రీ కాంత్ రెడ్డి, మన్మోహన్ నెడ్డి, ఎన్.శంకర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మణికొండలో కన్నుల పండువగా జగన్నాథ స్వామి రథయాత్ర



మణికొండలో భక్తికుటీర్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొన్న మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్.

**నార్సింగి, జూలై 3 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గురువారం భక్తికుటీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర" కన్నుల పండువగా సాగింది. ఈ రథయాత్రలో పెద్ద ఎత్తున భక్తజనులు పాల్గొని జగన్నాథుడి లీలలను స్తుతిస్తూ మైమరిచిపోయారు. ఈ వేడుకల్లో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం భగవన్నామ స్మరణం చేస్తే సర్వ పాపాలు హరించుకుపోతాయన్నారు. పంచభూతాలు, సూర్యచంద్రులు, సకల లోకాలు అన్నింటిని సరైన దిశలో నడిపించేది ఆ జగన్నాథ స్వామేనని వివరించారు. ప్రతీ హిందువు రోజులో కనీసం గంట సమయంను మన ఆధ్యాత్మిక అంశాలను తెలిపే పుస్తకాలు చదువాలని, భజనల్లో పాల్గొనాలని, దేవాలయాలకు వెళ్లడంను దిన చర్యలో భాగం చేసుకోవాలని, ధ్యానం చేయాలని సూచించారు. సాటి వారికి సహాయం చేయడంలో కలిగే తృప్తి అనంతమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, నాయకులు కిరణ్, పురుషోత్తం, ముత్యాలు, ప్రభావతి, శ్రీనివాస్, శ్రీపతి, పెద్ద సంఖ్యలో భక్త సమూహం పాల్గొన్నారు.

## ప్రతి ఏడాది ఏకలవ్యుడి జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలి



ఏకలవ్యుడి చిత్రపటానికి నమస్కారాలు తెలియజేస్తున్న ప్రజా సమితి నాయకులు

**సైఫాబాద్, జులై 3 ప్రభాతవార్త:** ప్రపంచంలో అత్యంత విలువైనది గురు, శిష్యుల బంధమని, నాటి కాలంలో తెలియజేసిన మహానుభావుడు ఏకలవ్యుడని ఈయన జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి డిమాండ్ చేసింది. మహాభారతంలో ఏకలవ్యుడు గురుభక్తిని చాటి ఔన్నత్యంను తెలియజేశారని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి చెప్పారు. ప్రజా సమితి ఆధ్వర యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఏకలవ్యుడి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు లక్షల మంది జనాభా కలిగిన ఎరుకల జాతి ఉందని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రతి ఏడాది ప్రభుత్వం ఆయన జయంతిని నిర్వహించాలన్నారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశిమికి 5 రోజుల ముందు తమ సమితి ఏకలవ్యుడి జయంతిని నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. అలాగే ట్యాంక్‌బండ్‌పైన ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, 33 జిల్లాల్లో కూడా విగ్రహాలను ఏర్పాటు చేసి జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా ఏకలవ్య కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు దుగ్యాల ఉపేందర్, అంజయ్య, శ్రీనివాస్, తిరుపతి సంపత్, కుమారస్వామి పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లపై తక్షణమే జీవో జారీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



బిసి విద్యార్థి సమావేశంలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త**

హైకోర్టు ఇచ్చిన గడువుకు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బిసి భవన్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై తక్షణమే జీవో జారీ చేయాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243/డి ప్రకారం రాష్ట్రానికి పూర్తి అధికారం ఉందని, 42 శాతం రిజర్వేషన్ల సాధించే వరకు పోరాటం ఆగదన్నారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు చేసుకున్న ప్రతి బిసి విద్యార్థికి గురుకులాల్లో అడ్మిషన్లు కల్పించాలని, అదనంగా గురుకులాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతను సమాయత్తం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఆర్.కృష్ణయ్య అయన్ను సత్కరించి అభినందించారు.

## కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి తొట్టెలకు పూజలు చేసిన బిజెపి నాయకులు గోవింద్‌రాఠి

**బేగంబజార్, జూలై3 ప్రభాతవార్త:**

బోనాలు ఉత్సవాలను పురస్కరించుకుని పాతనగరంలోని పురానాపూల్ స్వామి వివేకనందనగర్ కనకదుర్గ దేవాలయంలో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా కనకదుర్గ ఆలయంలో అభిషేకాలు, కుంకమార్చన ప్రత్యేక పూజలతోపాటు రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తొట్టెలను బ్యాండు మేళాల మధ్య యువకుల ఆటపాటలు, పోతరాజు మధ్య నృత్యాలు చేశారు. ఆలయంనుంచి బయలు దేరిన అమ్మవారిని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు హారుతులు ఇచ్చి కొబ్బరి కాయలు కొట్టి పూజలను చేశారు. అమ్మవారి తొట్టెలకు బిజెపి నాయకులు గోవింద్‌రాఠి, బిఆర్ఎస్ నాయకులు ముత్యాల గోవింద్‌రాజు, సంఘం అధ్యక్షులు ఎంపి. సదానంద్, సంఘ సేవకులు ఎంపి.భీష్మా తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. స్కైహి టీమ్ ప్రతినిధులు కొన్నింటి సుధాకర్, పి. కిరణ్‌కుమార్, ఎం.సతీషన, మిర్చి, పి.భరత్‌సాయి, విద్యాసాగర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి : కార్పొరేటర్



ఆలయాల వద్ద పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**పురానాపూల్, జూలై 3ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని పురానాపూల్ డివిజన్ పరిధిలోని అలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నంరాజ్ మోహన్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని చిన్నబజార్, రత్నాబాయి గల్లీ, ఎస్.వినగర్, చంద్రిక పురం తదితర ప్రాంతాలల్లో ఆయా విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడం తోపాటు బోనాల పండుగ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అదే విద్యుత్ దీపాలు, ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంబాలను తొలగించి దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## రూ.75 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జులై 3 ప్రభాతవార్త :** నాచారం డివిజన్లో రూ.75 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సావర్కర్ నగర్ రోడ్ నెంబర్ మూడు లో ఎరుకల బస్తీలో మరియు శ్రీరామ్ నగర్‌లో, వీఎస్టీ కాలనీలలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నాచారం డివిజన్ ను నెంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని చెప్పారు. తొందరలోనే పటేల్ కుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభిస్తామని అలాగే రాబోయే రోజుల్లో చెరువులోకి మురుగునీరు రాకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ. బాలకృష్ణ ఎఈ. వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్, బారాసా నాయకులు కార్యకర్తలు సావర్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎరుకల బస్తి వాసులు శ్రీరామ్ నగర్ కాలనీవాసులు, విఎస్టి నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్

## పిసిసి ప్రధాన కార్యదర్శులకు సన్మానం



పిసిసి ప్రధాన కార్యదర్శులు వట్టికూటి రామారావుగౌడ్, మాద సత్యంగౌడ్‌లను సన్మానిస్తున్న బాలగౌని బాల్‌రాజుగౌడ్, అయిలి వెంకన్న గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జులై 3 ప్రభాతవార్త**

పిసిసి ప్రధాన కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన గౌడ నేతలను గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఘనంగా సన్మానించింది. గురువారం చిక్కడపల్లిలోని కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ కార్యాలయంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావుగౌడ్, మాద సత్యంగౌడ్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు. గౌడ కలుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్ , గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ , బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్ దుర్గయ్య గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్య క్షులు సింగం నాగేశ్వర్ గౌడ్ , బాలగౌని వెంకటేష్‌గౌడ్, పోతగాని ఐలెన్ గౌడ్ తదితరులు రామారావుగౌడ్, సత్యంగౌడ్‌లను సత్కరించారు.

## సేఫ్టీ పరికరాలను వినియోగించాలి : ఎస్సీ వెంకన్న



సెఫ్టీ పరికరాలను అందవేస్తున్న ఎస్ఇ వెంకన్న

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:**

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఇ పి. వెంకన్న అన్నారు. మెహిదిపట్నం డివిజన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని సిబ్బంది కి విద్యుత్ సేఫ్టీ పరికరాలను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రత పరికరాలు తప్పనిసరిగా వినియోగిస్తే ప్రమాదాలు జరగవన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి




కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, నాయకులు

**చార్మినార్, జూలై 3 ప్రభాతవార్త :** పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల నాలుగవ తేదీన ఎల్‌బి స్టేడియంలో జరగనున్న బహిరంగ సభకు బ్లాకు అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా స్థాయి నాయకులు, అనుబంధ సంస్థల కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్, సయ్యద్ ఇక్బాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఆహ్వానపత్రిక అందజేత



**చార్మినార్, జూలై 3 ప్రభాతవార్త :** చారిత్రాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ ఆలయంలో ఈ నెల 20వ తేదీన జరగనున్న బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కలిసి కమిటి ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ బి.మారుతి యాదవ్, మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సభను విజయవంతం చేయండి : బసవరాజు సారయ్య



సమావేశంలో పాల్గొన్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జులై 3, ప్రభాతవార్త**

నేడు ఎల్బి స్టేడియంలో జరగనున్న కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీమంత్రి ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య పిలుపునిచ్చారు. గురువారం తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్‌తో కలిసి మూసాపేట్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యే ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు తీవ్రంగా కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శి చంద్ర శేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, జులై 3, ప్రభాతవార్త**

డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలో సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మొగులమ్మ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి కాబట్టి త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టి యుద్ధప్రాతిపదికన నాణ్యమైన సీసీ రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు పూర్తయిన సీసీ రోడ్లను మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, జాన్, భాస్కర్, గుడ్ల శ్రీనివాస్, ప్రదీప్, కటికరవి, కృష్ణ, నరసింహ, ప్రసాద్, శ్యామ్సన్, విక్రమ్, కనకయ్య, నాగరాజు, వర్క్ ఇన్స్పెక్టర్స్ రవి కుమార్, శ్రీనివాస్, సూపర్వైజర్ శివ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాల్గవ మహాసభలో పాల్గొనాలని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకి ఆహ్వానం



నాల్గవ మహాసభలో పాల్గొనాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని ఆహ్వానిస్తున్న సత్యం

**జీడిమెట్ల, జులై 3, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో ఈనెల 19వ తేదీన 125 డివిజన్ గాజులరామారం మహారాజా గార్డెన్స్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలో పాల్గొనాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని గురువారం సిపిఐ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఇతర సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఏఐటీయూసీ అధ్యక్షులు ఎండి యూసఫ్, ఉపాధ్యక్షులు ఏసురత్నం, మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ కే.స్వామి, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి స్వామి, సభ్యులు దయాకర్ రెడ్డి, హరినాథ్ రావు, వి శ్రీనివాస్, నరసింహారెడ్డి, బాచుపల్లి శ్రీనివాస్, యాదయ్య, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్ అర్చక ఉద్యోగుల జెసి ప్రధాన కార్యదర్శిగా కరణం మహేష్



గ్రేటర్ హైదరాబాద్ అర్చక ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మహేష్‌ను సత్కరిస్తున్న ఈ ఓ శ్రీనివాసశర్మ, బద్రీనాథాచార్యులు

**బేగంపేట జులై 3,ప్రభాతవార్త :**

గ్రేటర్ హైదరాబాద్ అర్చక ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శిగా సికింద్రాబాద్ ఎస్పీరోడ్డు శ్రీవీరహనుమాన్ ఆలయంలో అర్చకునిగా విధులు నిర్వర్తిస్తున్న కరణం మహేష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గురువారం సికింద్రాబాద్ ఎస్పీరోడ్డులోని శ్రీవీరహనుమాన్ ఆలయంలో ఆలయ ఈ ఓ శ్రీనివాస్‌శర్మ,ఆలయ ప్రధాన అర్చకులు చింత పట్ల బద్రీనాథ్ చార్యులు మహేష్‌ను శాలువాతో సత్కరించి శుభాభినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సీనియర్ల సూచనలతో సక్రమంగా నిర్వహిస్తానన్నారు.గ్రేటర్ హైదరాబాద్ అర్చక ఉద్యోగుల జేఏసీ తరుపున సమస్యలపై ఎప్పటి కప్పుడు అందరితో చర్చించి ముందుకు సాగుతానన్నారు.తనను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

## వాకర్లను ఇబ్బందులకు గురించేస్తే సహించేది లేదు : కార్పొరేటర్



**జీడిమెట్ల, జులై 3, ప్రభాతవార్త**

వాకర్లకు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలోని రాం లీలా మైదానంలో అక్రమంగా ఎగ్జిబిషన్ పెట్టడంతో తాము ఇబ్బందులకు గురైతున్నామని స్థానిక వాకర్స్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డికి తెలిపారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ అధికారులకు రాంలీల మైదానంలో ఎగ్జిబిషన్ గురించి ఆరా తీయాలనీ సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు జిహెచ్ఎంసి అధికారులు స్పందించి వెంటనే ఎగ్జిబిషన్‌ను తీసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలలో ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తూ, అనుమతులు లేకుండా అక్రమంగా ఎలాంటి పనులు చేసిన ఊరుకొనేది లేదు అని అన్నారు.

## వారాహి అమ్మవారి కృపా కటాక్షాలు భక్తుల అందరిపై ఉండాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జీడిమెట్ల, జులై 3, ప్రభాతవార్త**

వారాహి అమ్మవారి కృపా కటాక్షాలు భక్తుల అందరిపై ఉండాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆకాంక్షించారు. గురువారం 125 గాజులరామారం డివిజన్ షిరిడి హిల్స్‌లో వారాహి అనుగ్రహ పీఠం ఆధ్వర్యంలో శ్రీశ్రీ హర్షిత్ మహారాజ్ గురుజీ పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీ వారాహి అమ్మవారి ఆషాడ గుప్త నవరాత్రుల వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిమాన్విత అమ్మవారైన వారాహి అమ్మవారి కృపా కటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో షిర్డీ హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి సత్య, కోశాధికారి బాల కిషన్, కాలనీ వాసులు ప్రభాకర్ రావు, యశస్వి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూది మెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, తెలంగాణ సాయి, సుంకరి చందు, చిన్నా చౌదరి, కరుణాకర్ రాజు, ప్రసాద్, మహేష్, శివా నాయక్,జునైద్,గౌస్ పాల్గొన్నారు.

## ఆదర్శ కార్పొరేషన్‌గా నిలిపేందుకు అందరూ సహకరించాలి : కమిషనర్ శరత్‌చంద్ర




బండ్లగూడ జాగీర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, జులై 3 ప్రభాతవార్త :** బండ్లగూడను ఆదర్శ కార్పోరేషన్‌గా మార్చేందుకు అధికారులు, ప్రజలు అందరూ సహకరించాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో వంద రోజుల ప్రణాలికలో భాగంగా సమీక్షా సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధులు వేగంగా ప్రబలే ప్రమాదం ఉందని, పారిశుద్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా చెత్త, నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. మట్టితో కట్టి, వాడుకోకుండా ఉన్న పాత ఇళ్లు ఉంటే కూల్చివేయాలని ఆదేశించారు. ప్రజలందరికి మంచినీరు సరఫరా చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల రీవేరిఫికేషన్ చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్సు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలన్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల చేయాలని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు కేసులు, మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫాంల తయారీ, నూతన సంఘాల ఏర్పాటు, భువన్ జీయో ట్యాగింగ్, ఆస్థిపన్ను వసూళ్లు, అసెస్‌మెంట్లు, అభివృద్ధి పనుల పురోగతి, వీధి దీపాల నిర్వాహణ సవ్యంగా ఉండాలన్నారు. వన మహోత్సవంను విజయవంతం చేయాలని, ఇందులో ప్రజలు, కాలనీ వాసులు, యువజన, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణ, నర్సరీల నిర్వాహణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, డిఇఇ యాదయ్య, ఆర్.ఓ కె.శివకుమార్, ఏఈఈ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు : తలసాని



మెరుగైన వైద్యానికి సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్,జులై 3 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడే వారు వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని,సకాలంలో మెరుగైన చికిత్స చేయించుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో 27 మందికి మంజూరైన 9.10 లక్షల సిఎం.ఆర్.ఎఫ్.చెకులను తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. మెరుగైన వైద్యానికి సిఎం.ఆర్.ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పోరేటర్ మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్ అత్తిలి అరుణ గౌడ్, బిఆర్ఎస్ నేతలు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణ, శ్రీహరి, కిషోర్, నాగులు, మహేశ్ యాదవ్,లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల పరిసర ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలి



రెజిమెంటల్ బజార్ ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శిస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక

**కంటోన్మెంట్,జులై 3 ప్రభాతవార్త:** బోనాల జాతర మహోత్సవాలను పురస్కరించుకొని మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గుంతల మయంగా ఉన్న రోడ్లకు మరమ్మత్తు చేపట్టాలని కార్పోరేటర్ కొంతం దీపిక జిహెచ్ఎంసి ఇంజనీర్లకు సూచించారు. గురువారం ఆమె డివిజన్‌లోని గ్యాస్ మండి రేతిఫైల్ బస్టేషన్,రెజిమెంటల్ బజార్‌పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిత్తూ, ప్రశాంత్, నరిసింగ్, గణేష్, రాహుల్, సంగీత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కటుంబానికి రూ.50 వేల ఆర్ధిక సహాయం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**సంజీవరెడ్డి నగర్,జులై 3 ప్రభాతవార్త:** విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో నష్టపోయిన కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఉదయం సనత్ నగర్‌లోని రాజరాజేశ్వరి నగర్‌లో రవి,మాధురి దంపతులు అద్దెకు ఉంటున్న ఇంట్లో షాట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న తలసాని వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాము బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం చోటు చేసుకుందని రవి దంపతులు వివరించారు. 7 సంవత్సరాల తమ కుమారుడు మాన్విత్ ప్రమాదం గురించి ఫోన్‌లో తమకు తెలుపగా హుటా హుటీనా చేరుకున్నామని చెప్పారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యక్తిగతంగా ఆర్ధిక సహాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన వారికి ధైర్యం చేప్పారు. అదే విధంగా అమీర్‌పేట్ డిప్యూటీ తహశీల్దార్ బాల్‌రాజ్, ఆర్.ఐ.కిరణ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు సురేశ్ గౌడ్, ఖలీల్,శేఖర్,రాజేశ్ ముదిరాజ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు పనిచేయాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



నూతన సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**పేట్ బషీరాబాద్, జులై 3, ప్రభాతవార్త**

ఐకమత్యంతో పనిచేస్తూ రాజీవ్ గృహకల్ప అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు పనిచేయాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బాచుపల్లి 2 బి.హెచ్.కే 7వ బ్లాక్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలోని లబ్ధిదారుల సమస్యలు, బాగోగులను తెలుసుకుంటూ ఐకమత్యంతో రాజీవ్ గృహకల్పను అభివృద్ధి చేసుకునే విధంగా నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. రాజీవ్ గృహకల్పలో సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గ సభ్యులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులు మద్దెల సత్యనారాయణ, సలహాదారులు భాస్కరా చారి, ప్రధాన కార్యదర్శి సత్యవతి, కోశాధికారి మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, సంయుక్త కార్యదర్శి రామా రావు, ఉపాధ్యక్షులు సజ్జు, కార్యనిర్వా కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ విజయవంతానికి తరలిరవాలి



శ్రీరామ్‌నగర్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళీగౌడ్.

**యూసుఫ్‌గూడ, జులై 3, ప్రభాతవార్త:**

అఖిల భారత కాంగ్రెస్ కమిటి బహిరంగ సభ ఎల్‌బి స్టేడియంలో జరుగనున్న సందర్భంగా శుక్రవారం పెద్దఎత్తున నాయకులు కార్యకర్తలు తరలి రావాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి మురళీగౌడ్ తెలిపారు. ఈసందర్భంగా రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భారీ బహిరంగ సభకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏఐటిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే అఖిల భారత కాంగ్రెస్ కమిటి జనరల్ సెక్రటరీ కె సి వేణు వేణుగోపాల్ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరుగుతుందని దాన్ని విజయవంతం చేసేందుకు తమ వంతుగా రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఆధ్వర్యంలో తామంతా ఈ సభను విజయవంతం చేసేందుకు సమ్మగ్గమయ్యామని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో జి.శ్రీనువాస్ గౌడ్, వినోద్, అబ్దుల్ ఖాదర్, కొండపల్లి రమేష్, ముత్యాల యాదగిరి, గౌస్, తదిరతులు పాల్గొన్నారు.

## ఎస్. ఆర్.నగర్ క్రిష్ ఇన్ హోటల్‌లో అగ్నిప్రమాదం

**సంజీవరెడ్డి నగర్, జులై 3 ప్రభాతవార్త:**

ఎస్.ఆర్.నగర్‌లోని క్రిష్ ఇన్ హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఎస్.ఆర్.నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్.నగర్‌లోని పీఎస్ పరిధిలోని కమ్యూనిటీ హాల్ సిగ్నల్స్‌దగ్గర్లో క్రిష్ ఇన్ హోటల్ కిచెన్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. బారీగా మంటలు ఎగసి పడ్డాయి. 5 అంతస్థుల భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో పై అంతస్థులలో కొంత అక్కడే చిక్కుకు పోగా వారిని కాపాడేందుకు అగ్ని మాపక సిబ్బంది, ఎస్. ఆర్.నగర్ పోలీస్ సిబ్బంది వారిని సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

# నూజివీడు సీడ్స్ ముందు ఆందోళనకు దిగిన రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

**పేట్ బషీరాబాద్, జులై 3, ప్రభాతవార్త**

తాము పండించిన సీడ్‌కు ఎనిమిది నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు గురువారం పెద్ద ఎత్తున నూజివీడు సీడ్స్ ముందు టెంటు వేసి ఆందోళనకు దిగారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం గొరిల్లా తండాకు చెందిన గ్రామ రైతులు దాదాపు ఆరు లారీల వడ్లను సీడ్స్ వడ్లను ఆర్గనైజర్ సత్యనారాయణ ద్వారా నూజివీడు కంపెనీకి సరఫరా చేశారు. సరఫరా చేసి తొమ్మిది నెలలు కావస్తున్న మళ్లీ పెట్టుబడులకు పైసలు రాకపోగా అడిగినప్పుడల్లా రేపు మాపు అంటూ దాటవేస్తుండడంతో రైతులు మూడు డీసీఎంలు, మూడు కార్ల ద్వారా కొంపెల్లిలోని నూజివీడు పరిశ్రమ ముందు ఆందోళనకు దిగారు. దాదాపు కోటి యాభై లక్షల రూపాయలను నూజివీడు సీడ్స్ పరిశ్రమ యాజమాన్యం రైతులకు ఇవ్వాలి, అంత డబ్బును దగ్గర పెట్టుకుని తొమ్మిది నెలలైనా చిల్లిగవ్వ ఇవ్వకపోవడంతో జూన్‌లో వేసే మొక్కజొన్న, కంది పంటలకు పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతుండడంతో ఆర్గనైజర్‌ను నిలదీశారు. దీంతో ఆర్గనైజర్ సత్యనారాయణ వారందరిని వెంటబెట్టుకొని పరిశ్రమ వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో యాజమాన్యం ఆర్గనైజర్ సత్యనారాయణను లోపలికి పిలుచుకొని సంప్రదింపులు చేస్తుంది. రైతులు డబ్బులు చెల్లించే వరకు ఇక్కడ నుంచి వెళ్ళేది లేదని బీష్మించుకొని కూర్చున్నారు. డబ్బులు చెల్లించకుంటే పరిశ్రమ ముందే టెంట్ వేసుకొని వంట చేసుకుంటూ ఆందోళన చేస్తామని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## ప్రగతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలకు ఉచిత ట్యూషన్లు



ఉచిత ట్యూషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**నిజాంపేట్, జులై 3, ప్రభాతవార్త**

శ్రీ కళ్యాణ్ ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ సుందరయ్య భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రగతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల కోసం ఉచిత ట్యూషన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం గురువారం నుంచి ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు మిథిలా నగర్ సమీపంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించబడుతుంది. ఈ అవకాశం కేవలం ప్రగతినగర్ బాలికలకే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు కూడా అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ కళ్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినులు తమ విద్యను మెరుగుపర్చుకునేందుకు ఇది గొప్ప అవకాశమని అన్నారు. ఈ ట్యూషన్ ప్రోగ్రాం భవిష్యత్తులో వారి ప్రగతికి బలం ఇస్తుందని పేర్కొన్నారు. లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇది కేవలం ట్యూషన్లకు మాత్రమే కాక, విద్యార్థుల లైఫ్ స్కిల్స్ అభివృద్ధికి కూడా దోహదపడే కార్యక్రమని తెలిపారు. సుందరయ్య భవన్ కన్వీనర్ మల్లయ్య చారి మాట్లాడుతూ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఉచిత ట్యూషన్ కార్యక్రమం రెండవ సంవత్సరంలో ప్రవేశించడంతో చాలా ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలకు మా పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కళ్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా. ప్రశాంత్ కుమార్, సుందరయ్య భవన్ కన్వీనర్ మల్లయ్య చారి, జెవివి నాయకులు శంకర్ రావు, మాజీ కార్పొరేటర్ వెంకట రామయ్య, రాజేశ్వరరావు, బాల వెంకటేశ్వరరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రమణీయం రసవత్తరం శ్రేష్ఠ శ్రీతల భరతనాట్య ఆరంగేట్రం

**రవీంద్రభారతి, జులై 3 ప్రభాతవార్త :**



శ్రీవారిపాదాలు భరతనాట్యం, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో ప్రఖ్యాత నాట్య గురు డా. ఎన్.రమాదేవి పర్యవేక్షణలో ఆమె శిష్యులైన సోదరీమణులు గుండు శ్రీలక్ష్మి శ్రేష్ఠ, గుండు శ్రీతలు ఆరంగేట్రంలో అద్భుత నాట్యచాతుర్యాన్ని, అశేష ప్రతిభను ప్రదర్శించి విచ్చేసిన అసంఖ్యాత ప్రేక్షకులు, కళాప్రియులను తన్మయుల్నిచేసి ప్రశంసలందుకున్నారు. 11, 9 ఏళ్ల ప్రాయంలోనే భారతీయ శాస్త్రీయ నృత్యం భరతనాట్యంపై ఆసక్తితో శిక్షణ ప్రారంభించి ప్రభుత్వ గుర్తింపు పొందిన భరతనాట్యంలో డిప్లమా, డిగ్రీలను కూచా పూర్తి సంపూర్ణ పరిణతితో నేడు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తమ తొలిప్రదర్శనలో మంత్రముగ్ధులను చేశారు. శ్రేష్ఠ, శ్రీతలు భరతనాట్య ఆరంగేట్రంను మొదట ప్రార్ధనతో ప్రారంభించి తదుపరి అలరిప్పు, పుష్పాంజలి, నటేషకౌత్వం, జతిస్వరం, అష్టలక్ష్మిస్తోత్రం, జావళి, శబ్ధం, శివతాండవం, శ్రీఅన్నమాచార్య కీర్తన బ్రహ్మకడిగిన పాదము, చివరిగా కళింగనర్తన తిల్లానా అంశాలను లయ శృతిబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శిస్తూ గురువును, అతిథులను మెప్పించి శుభాశీస్సులందుకున్నారు. గురువు ఎన్.రమాదేవి నట్టువాంగం–కొరియోగ్రఫీ; చంద్రరావు గాత్రం; చంద్రకాంత్ మృదంగం; ఉమావెంకటేశ్వర్లు వేణువుతో వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ప్రదర్శనానంతరం విచ్చేసిన ప్రముఖ అతిథులు భరతనాట్య ఆరంగేట్రం కావించిన సోదరిమణులు శ్రేష్ఠ, శ్రీతను, నాట్యగురువు ఎన్.రమాదేవిని ఘనంగా సత్కరించారు.

## ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు



ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, జులై 3 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం లో బుధవారం హుండీ లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, కార్యనిర్వాహణ అధికారి మాచర్ల దేవనాథం నిర్వహణలో జరిగిన ఈ లెక్కింపులో రూ.2,08,852 దేవాలయానికి ఆదాయం వచ్చింది. దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.శేఖర్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నెల్లి శ్యామ్‌కుమార్, కంది సుబ్బారావు, ఆలయం ముఖ్యఅర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, అర్చకులు వెంకటాద్రి, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసికి ఎన్నికలు జరిగినా మేయర్ స్థానం బిజెపిదే

-సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

**చిక్కడపల్లి, జులై 3 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసికి ఎన్నికలు జరిగినా మేయర్ స్థానంతో పాటు మెజారిటీ కార్పొరేటర్ స్థానాలను బిజెపి దక్కించుకోవడం ఖాయమని ఆ పార్టీ యువ నేత కోవా రాహుల్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్ గౌడ్ అన్నారు. గురువారం అడిక్‌మెట్‌లో స్థానిక బిజెపి డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు స్టీల్‌ప్లేట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గసభ్యుడు పూస రాజు, రొయ్యూరు శేషసాయి, డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శులుఉ కె.రాజ్ కుమార్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, టెండరు ప్రకటన
క్ర.సం.1. నిట్ నెం : 12/SE(M)/CRZ/GHMC/2025-26, తేది: 02.07.2025.
పనియొక్క పేరు : 01 నం. సివిల్ పని. అంచనా మొత్తం (రూ.లక్షలలో) : 155.00. బిడ్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 03.07.2025 సా.5.00గం, బిడ్ స్వీకరణకు చివరి తేదీ సమయం: 10.07.2025 మ.3.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: శ్రీ వై. మహేశ్వర్‌రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, GHMC, ఫూల్‌బాగ్, బాబానగర్, ఫోన్: 7993354273. తదుపరి వివరాలు https://tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్ (M), చార్మినార్ జోన్, GHMC.
DIPR.NO.4538-PP/CL/ADVT/1/2025-26 తేది: 03.07.2025

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Thota Pranusha D/o Thota Chandra Shekher, R/o Brigade Citadel, Flat No. A2-925, Ashok Nagar, Moti Nagar, Moosapet, Medchal-Malkajgiri Dist., TS. Have Changed my Mother name from SUJATHA THOTA to SALLA SUJATHA for records purpose.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

Notice under Section 17 of SARFAESI Act, 2002 Read with provisions of the Recovery of Debts Due to BANKS AND Financial Institutions Act, 1993 and the Debts Recovery Tribunal (Procedure) Rules, 1993 as amended from time to time.
In the Debts Recovery Tribunal- II
Telangana and Andhra Pradesh, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001

I.A NO. 1309 OF 2025
IN
S. A. No. 7 of 2025

Between:-
M/s Rajitha Plastics Rep. by its proprietor and another ...Petitioners/Applicants
And
M/s HDB Financial Services Limited, Rep. by its Authorised officer & Another ...Respondent/Proposed Respondent

To,
1) Sri Nagendra Prasad Avula
S/o. Late Nagaraju Avula, MIG-3691, Phase-II, Road No.8, Viduth Nagar BHEL, Ramachandra Puram, Medak, Telangana - 502032

An application under Section 17(1) of the Securitization & Reconstruction of Financial Assets & Enforcement of Security Interest Act, 2002 has been filed before this Tribunal (a copy of application is enclosed).
Show cause as to why the relief prayed for should not be granted. You are required to file reply, if any, in your defense in the paper book form in two complete sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before this Tribunal on 07-07-2025 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.
You are further directed to supply advance copy of the reply to the Securitsation Application to the Counsel for the applicant.
A copy of the application is enclosed herewith. The copy of the annexure is also enclosed. A digital copy of the application along with all annexure is also available on DRT system. You are directed to get the same downloaded along with all the annexure on your appearance before the Tribunal.
If you intend to file any documents, you may file the same with a list along with the written statement by using the link drt.gov.in.
Given under my hand and the seal of this Tribunal on this 3rd day of July 2025.
By order of Tribunal
Sd/- Registrar

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL SENIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT MALKAJGIRI
IA No. 420 OF 2025
IN
OS No. 1837 OF 2007

Between:
Ramidi Malla Reddy (Died) as per LRs ...Petitioners/Plaintiffs
AND
Ramidi Narasimha Reddy (Died) as per LRs ...Respondents/Defendants

To,
24. ASVS Narayana Raju S/o. ASRKVSS Narayana Raju, Aged about 43 years, Occ: Business, R/o. H.No.8-3-720/15, Yellareddyguda, Srinagar Colony, Hyderabad.

Please take notice in the above IA that the petitioners/plaintiffs herein have filed the above suit for partition and separate possession against you before the Hon'ble Court. Therefore, you, the above respondent / defendant, hereby informed that if you have got any objection or interest should appear and file the same before the above said Hon'ble Court on **15/07/2025 at 10.30 A.M** through counsel or in person failing which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
Sd/- KOTA RAMCHANDRA REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/1/1, Raghavendra Nagar, Moula Ali, Hyderabad-40.
Cell No. 98493 25055.

IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O S NO 720 OF 2025

BETWEEN:
1. Uma Medury
2. Kuchibotla Rama Sastri
3. Vavilala Srinivas
Plaintiff No.2 & 3 are represented by Their GPA Holder i.e., Plaintiff No. 1 ...PLAINTIFFS
AND
THE TAHSILDAR
Himayathnagar Mandal
And Another ...DEFENDANTS

To,
All Concerned.

Please take notice that the above named Plaintiffs have filed the above suit against Defendants for Declaration, declaring the Plaintiffs as the LEGAL HEIRS of Late Vavilala Vasudeva Sastri and Late Smt. Vavilala Kamala Sastri in respect of the properties i.e., Flat No. 4 on second floor admeasuring 900 Sft, situated in premises No. 3-6-779, Himayat Nagar, Hyderabad known as Laxminarayan Apartments No. 17 and Flat No. 103 in 1st floor, H.No.2-2-1133/4/C & D admeasuring 1050 Sq.Feet with Undivided share of land 50 Sq yards out of total land 400 Sq. Yards situated at New Nallakunta, Hyderabad. If any person or persons having any objections or claims they may appear on **29.08.2025 at 10.30 A.M** before the above said court, either in person or through an advocate failing which the matter will be decided basing the documents available on record.

// BY ORDER OF THE COURT //
M. RANJITH KUMAR
K. ARAVIND REDDY
SALONE JAIN
ADVOCATES
Flat No. 3, H No. 2-1-338/A, Nallakunta, Hyderabad.
9849425728, 9885522693

## సీసీ రోడ్ల నిర్మాణానికి కాలనీ వాసులు సహకరించాలి : కార్పొరేటర్



**హయత్ నగర్, జులై 3 ప్రభాతవార్త :** నూతనంగా నిర్మించే సి.సి రోడ్లకు కాలనీవాసులు సహకరించాలని...రోడ్లపైకి నిర్మించిన గోడలను, రాంపులను, మెట్లను తొలగించాలని మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి సూచించారు. మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్ పరిధి హయత్ నగర్ ప్రాంతంలోని పవనగిరి కాలనీలో 36.50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... .రోడ్డు నిర్మాణంలో లెవెల్స్ ను పాటించాలని నాణ్యతను విస్మరించరాదని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాలనీవాసులు అందుబాటులో ఉండి పనులను కాంట్రాక్టర్ కు సూచించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కృష్ణమూర్తి గౌడ్, నరసింహా, వేణుగోపాల్ రెడ్డి, మహేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### ఎస్‌బిహెచ్ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 2 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎస్‌బిహెచ్ జిపి 1 కాలనీలో నూతనంగా వేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఆనంద్, జిహెచ్‌ఎంసి ఏఇ వెంకన్న, వర్క్ ఇన్స్‌పెక్టర్ రాజ్ కుమార్, కాలనీవాసులు ఆనంద్ మోహన్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ బస్సులు, వ్యాన్‌లు, ఆటోల తనిఖీ



డ్రంక్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్

**సైదాబాద్, జులై 3 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ఐఎస్ సదన్ చౌరస్తాలో స్కూల్ ఆటోలు, వ్యాన్స్, బస్సులను తనిఖీ చేశారు. విద్యార్థులను తీసుకువెళ్తున్న వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులను నిర్వహించారు. వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. విద్యార్థుల సేఫ్టీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఎసిపి చంద్రకుమార్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్‌లు తెలిపారు.

### సిఎం సహాయనిధితో పేదలకు లబ్ది : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎల్.ఓ.సి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 3 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది చేకూరుతుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ చిలకలబస్తీకి చెందిన నిఖిత కీళ్ల నొప్పుల సమస్యతో బాధపడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించి సహాయం చేయాలని కోరడంతో ఆయన వెంటనే స్పందించి సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1.50లక్షల ఎల్.ఓ.సి చెక్కును గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా నిఖిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని, నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు పొందడానికి సిఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న యుఎల్‌సి సమస్యను పరిష్కరించాలని వినతి



**మల్కాజిగిరి జులై3,ప్రభాతవార్త :**
గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ లో దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న యు ఎల్ సి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని మల్కాజిని శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ లు గురువారం మల్లికార్జున నగర్ కాలనీ వాసులతో కలిసి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్గిరి నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మల్లికార్జున నగర్ లో నెలకొన్న యు ఎల్ సి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలో సమస్య పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, భైరు అనిల్ కుమార్, మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటయ్య, అచ్యుతారావు, గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు

## యాప్రాల్‌లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు

-చోద్యం చూస్తున్న మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ అధికారులు
- బిల్డర్ల బరితెగింపు చర్యలతో అక్రమ నిర్మాణాలు
-ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
-అధికారులు నోటీసులతో కాలయాపన చేస్తున్న వైనం







**నేరేడ్ మెట్, జులై 3,ప్రభాతవార్త :**
మల్కాజ్గిరి టౌన్ ప్లానింగ్ అధికారుల అలసత్వం, బిల్డర్ల బరితెగింపు చర్యలతో మల్కాజ్గిరి సర్కిల్ నేరేడ్మెట్ డివిజన్ యాప్రాల్ ప్రాంతంలో జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. డివిజన్ పరిధిలోని యాప్రాల్ విలేజ్, ఎంప్లాయిస్ కాలనీ, జీకే ప్రైడ్, డిబి ఆర్ కాలనీ, నాగిరెడ్డి చెరువు నుంచి బాలాజీ నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో , నిబంధనలకు విరుద్ధంగా జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రౌండ్ ఫ్లోర్ పై రెండు అంతస్తుల అక్రమ నిర్మాణం, అదేవిధంగా రెండు అనుమతులు పొంది నాలుగు ఫ్లోర్ల ఒకే బహుళ అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టడం, పెంట్ హౌస్ లు, అదనపు అంతస్తులు అక్రమంగా నిర్మాణదారులు నిర్మాణాలు చేపడుతున్న మల్కాజిగిరి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజాసంఘాల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు బహిరంగంగా పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వం నకు భారీ ఆదాయానికి గండి పడుతున్న అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడం విడ్డురంగా ఉన్నది., ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు మనకెందుకులే అనే ధోరణి, కిందిస్థాయి సిబ్బంది చేతివాటం, ఉన్నతాధికారి నిర్లక్ష్యం కారణంగా మల్కాజి సర్కిల్లో విచ్చలవిడిగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. సిబ్బంది కొరత వల్ల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లో జాప్యం జరుగుతుందని టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫిర్యాదు అందితే నోటీసులు జారీ చేస్తున్నామని, అనంతరం లైన్ ప్రకారం కూల్చివేతలు చేబడుతామని పేర్కొన్నారు. యాప్రాల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు.

## మహబూబ్‌నగర్ ఘటనపై మార్కెట్ కమిటీ ఉద్యోగుల నిరసన



మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో నిరసన వ్యక్తం చేస్తున్న సెంట్రల్ ఫోరం అధ్యక్షులు చిలక నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముక్రం తదితరులు

**మలక్ పేట,జులై 3 , ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్‌పై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ దాడి చేయడాన్ని నిరసిస్తూ మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయం ఆవరణలో టీఎన్‌జీఓ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షులు చిలక నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముక్రం ల ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో లైసెన్స్ హమాలి ఆడ కూలీలకు ప్రభుత్వం కల్పించిన డ్రస్సులలో పంపిణీ కార్యక్రమంలో లైసెన్స్ లేని వారికి కూడా డ్రస్సులు ఇవ్వమని వైస్ చైర్మన్ ఒత్తిడి చేయడంతో నిబంధనలకు విరుద్ధమని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్ తెలియజేయడంతో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయకుమార్ విచక్షణ రహితంగా దాడి చేసిన సంఘటన ను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దాడికి నిరసనగా రాష్ట్రంలోని అన్ని మార్కెట్ కమిటీ కార్యాలయాల ఆవరణలో భోజన విరామ సమయంలో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దాడి చేసిన వైస్ చైర్మన్‌పై మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, ఆయనను ఆ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల ఆదేశాలు జారీ చేయాలని మార్కెట్ కమిటీ ఉద్యోగుల పక్షాన, టీఎన్‌జీఓ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్, మార్కెటింగ్ శాఖ మంత్రిని, ప్రిన్సిపల్ సెక్రటరీని, సంచాలకులను కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ సెక్రటరీ సంతోష్, హైదరాబాద్ జిల్లా యూనిట్ అధ్యక్షులు ఖలీల్ అహ్మద్, నాయకులు రేవంత్, పవన్ , షరీఫ్, మాధురి వేణు తదితరులు పాల్గొన్నారు

## గిరిజన మహిళను అక్రమంగా నిర్బంధించారంటూ గిరిజన సంఘాల ధర్నా



సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

**సైదాబాద్, జులై 3 ప్రభాతవార్త:** సివిల్ వివాదంలో బాధితుల తరపున పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ గిరిజన మహిళను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ గిరిజన సంఘాల నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ సివిల్ వివాదానికి సంబంధించి బాధితుల తరపున స్థానిక సిపిఐ నాయకురాలు సక్రిభాయి గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. అయితే పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సక్రిభాయిని ఎస్‌ఐ సాయికృష్ణ దుర్భాషలాడుతూ ఫోన్ లాక్కుని, పిఎస్‌లో అక్రమంగా కూర్చోబెట్టారని గిరిజన సంఘం నాయకులు తెలిపారు. మధ్యాహ్నం వరకు కూడా సక్రిభాయిని బయటకు వెళ్లనీయక పోవడంతో, విషయం తెలుసుకున్న గిరిజన సంఘం, సేవాలాల్ బంజారా సంఘం నేతలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ధర్నాకు దిగారు. గిరిజన మహిళను అక్రమంగా నిర్బంధించిన ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నా రు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం వ్యవ స్థాపక అధ్యక్షుడు కొర్ర మోతిలాల్ నాయక్, మోహన్ నాయక్, శాంతిబాయి, జానిబాయి, అశోక్ నాయక్, పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెవాసులకు పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలి : కోట్ల శ్రీనివాస్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శ్రీనివాస్

**సైదాబాద్, జులై 3 ప్రభాతవార్త:** సైదాబాద్ మండల పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో సర్వే నెం. 65 నుండి 77, 133 పార్ట్, 125 పార్ట్‌లోని 25 ఎకరాలలో నివాసముంటున్న పేదలందరికి వెంటనే పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలని కోరుతూ హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరంన ఆయన మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని, వారికి ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయని, కరెంటు మీటర్లు ఉన్నాయని, ప్రభుత్వం తరపున సిసి రోడ్లు, బోర్‌వెల్స్ వేయడం జరిగిందని, గుడిసెల్లో నివాసముంటున్న వారందరు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని, అయితే సొసైటీల పేరుతో కొందరు పేదలను ఇక్కడ నుంచి వెళ్లగొట్టడానికి కుట్ర చేస్తున్నారని, గుడిసెవాసులందరికి గుడిసెలు ఉన్న చోటే పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరడం జరిగిందని కోట్ల శ్రీనివాస్ తెలిపారు. తాను చేసిన విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూలంగా స్పందించడం జరిగిందని, గుడిసెవాసులకు ఉన్న చోటే డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పడం జరిగిందని కోట్ల శ్రీనివాస్ తెలిపారు.

## అభివృద్ధి పనులు, సమస్యలు, పెండింగ్ వర్క్స్‌పై సబితా ఇంద్రారెడ్డి సమీక్ష



**సరూర్‌నగర్, జులై 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్, కుర్మల్‌గూడలకు సంబంధించిన అభివృద్ధి పనులపై గురువారం మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. నాదర్‌గుల్‌కు సంబంధించి ప్రధాన రోడ్డు నిర్మాణంలో జాప్యం తదితర సమస్యలు, అదే విధంగా కుర్మల్‌గూడలో తాగు నీటి సమస్యలతో పాటు ఇతరత్రా సమస్యలు ఉన్నందున వాటన్నిటి పరిష్కారం కోసం సబితారెడ్డి బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ గాంధీనగర్ నుండి నాదర్‌గుల్ వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో జాప్యం.. ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై ఆమె స్పందిస్తూ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశనం చేశారు. రహదారి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్ల తొలగింపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే సూచనలు చేశారు. బోనాల పండుగ సమీపిస్తున్నందున సిసి రోడ్డు నిర్మాణం జరపాలని అన్నారు. ఇక పోతే కుర్మల్‌గూడ జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీవాసులకు తాగు నీటి సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకొని మంచి నీటిని సరఫరా చేయించాలని ఆమె జలమండలి అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఎమ్మెల్యే టెండర్లు పూర్తి అయినా ఇంకా ప్రారంభంకాని అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని ఆమె స్పష్టం చేశారు. అవసరమైతే కాంట్రాక్ట్‌లను రద్దు చేసి కొత్తగా కాంట్రాక్ట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల ప్రక్రియలను, పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసి అభివృద్ధికి సంబంధించిన వాటిని ప్రజలకు అందుబాటులో తేవాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కమీషనర్ పి.సరస్వతి, అసిస్టెంట్ కమీషనర్ జాన్ కృపాకర్, డిఇఇలు యాదయ్య, వెంకన్న, ఎఇఇ హరీష్, మేనేజర్ బొమ్మ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, అక్కౌంటెంట్ అరుణ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్ శంకర్, టౌన్ ప్లానింగ్ సీనియర్ అసిస్టెంట్ అనూషరెడ్డిలతో పాటు ఫారెస్టు, విద్యుత్, వాటర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

### ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఇన్స్‌పెక్టర్ నరేష్



గడ్డి అన్నారం ఆషూర్ ఖానా లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్, మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మలక్ పేట ,జులై 3, ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్ పేట ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు. మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మొహరం పండుగను పురస్కరించుకుని గడ్డి అన్నారం ఆషూర్ ఖానలో ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి మతసామరస్యంతో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ శేఖర్ రెడ్డి, మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్, నాగిరెడ్డి, శివకుమార్ ఎన్ ప్రవీణ్ కుమార్ పాష, బి వెంకటేశ్వర్లు, అజ్మల్ ఖాన్, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి చౌరస్తాలో వర్షం పడితే భయపడుతున్న ప్రజలు





**తుర్కయంజాల్ జులై 3,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాగర్ హైవే బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నడిరోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడం వల్ల అక్కడ మహిళలు స్కూల్ సంబంధించిన విద్యార్థులు ప్రజలు రోడ్డు దాటాలంటే బస్సులు, లారీలు, కార్లు,మోటార్ సైకిల్ స్పీడ్ పోవడం వల్ల అక్కడ ఉన్న నీరు వాళ్లపై పడుతున్న అధికారులు చూసి చూడనట్లుగా వెళుతున్నారు కాబట్టి అక్కడ వెంటనే ఆ నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి స్థానిక అధికారులు తగిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి మరియు రోడ్ల నిర్వహణపై దృష్టి పెట్టాలి. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు తెలియజేశారు.

### విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దయానంద్‌గుప్తా, మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

**ఎల్‌బినగర్, జులై 3 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు బొగ్గారపు శరత్‌చంద్ర ఆధ్వర్యంలో గురువారం చైతన్యపురి డివిజన్ ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించిందని, విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ బి.విజయరంగా, బండ సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, జి.రవికేశవనాయుడు, భాస్కర్, చిన్నగౌడ్, చరణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### మీర్‌పేట్ జనప్రియావాసికి రూ.2 లక్షల ఎల్‌ఓసి అందజేత



**సరూర్‌నగర్, జులై 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జనప్రియా మహానగర్‌కు చెందిన అనారోగ్య బాధితుడు డి.సాయికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన రూ.2 లక్షల ఎల్‌ఓసిని గురువారం మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అందజేశారు. స్థానిక కార్పొరేటర్ పాలమూరి విజయలక్ష్మి రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందెల చేతుల మీదుగా సాయి చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా సాయం అందడానికి సహకరించిన చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, విజయలక్ష్మి రాజులకు కృతజ్ఞతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, అభిమన్యు, రాజు, వెంకట్, అరవింద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు : మధుర ఉపేందర్‌రెడ్డి



పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మధురాఉపేందర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, జులై 3 ప్రభాతవార్త:** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీలోని ఐరా గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. ప్రకృతి వనం, పచ్చదనం పై చిన్నారులకు విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలని సూచించారు. సందర్భంగా కాలనీలో పలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మెన్ సందీప్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్‌పాల్, ప్రిన్సిపల్ పద్మజ, నవీన్, సంధ్య, పద్మశ్రీ, మానస, మాధవి తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న సురేందర్ యాదవ్

**ఎల్‌బినగర్, జులై 3 ప్రభాతవార్త:** జగన్నాథ రథయాత్ర కార్యక్రమం భక్తుల కులాల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగోల్ డివిజన్‌లోని జనప్రియ ఎన్‌క్లేవ్‌లో అంగ రంగ వైభవంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్రలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళల భక్తులు పాల్గొని ఈ రథయాత్రను ముందుకు తీసుకువెళ్లారు.

### కాలనీవాసులకు సిసి కెమెరాలు పై అవగాహన సదస్సు



**నేరేడ్మెట్ జులై 2 ప్రభాతవార్త :**
నేరాలు అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని సింహాద్రి నగర్ కాలనీవాసులకు నేరేడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ సూచించారు. గురువారం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింహాద్రి నగర్ కాలనీ వాసులకు పోలీస్ స్టేషన్ ఆవరణలో సీసీ కెమెరాలు ఆవశ్యకతపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల అదుపునకు, సీసీ కెమెరాల ద్వారా నేరస్తులను పట్టుకోవడం ఈజీ అవుతుందని పేర్కొన్నారు. కాలనీ పురవీధుల్లో, టర్నింగ్ పాయింట్లలో కాలనీ సంక్షేమ సంఘం సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాలనీ పెద్దమనుషులకు సూచించారు.

### బాలాపూర్ చిగిరింత పెద్ద బాల్‌రెడ్డి హఠాన్మరణం

నివాళులర్పించిన సబితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి



**సరూర్‌నగర్, జులై 3 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన ముఖ్యుడు, బాలాపూర్ చౌరస్తాలోని సూపర్ థియేటర్ సహ యజమాని చిగిరింత బాల్‌రెడ్డి ఆకస్మిక మృతి చెందారు. బాలాపూర్‌లోని తన నివాసంలో బుధవారం రాత్రి నిద్రపోయిన ఆయన గురువారం ఉదయం అయినా మేల్కొకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే బాల్‌రెడ్డి మృతి చెందినట్లు ధృవీకరించారు. నిద్రలోనే తీవ్ర గుండె నొప్పి రావడంతో మరణించినట్లు నిర్ధారించారు. కాగా బాల్‌రెడ్డి మృతి పట్ల బాలాపూర్ చౌరస్తా, బాలాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించిన మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించి బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు సోదరులు చిగిరింత మల్లారెడ్డి, భాగ్యనగర్ సొసైటీ డైరెక్టర్ చిగిరింత పెద్ద నర్సింహారెడ్డి (శ్రీరాంరెడ్డి)లను పరామర్శించారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పార్కు స్థలాల కబ్జాలపై చర్యలు తీసుకోరా?

-23 వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోరా!
-బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్యాక్రాంతమైన కోట్లాది రూపాయల విలువ చేసే ఓపెన్ స్థలాలు, పార్కు స్థలాలను కాపాడాలని దాదాపు ఏడాది నుండి బిజెపి తరపున అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని కార్పొరేషన్ బిజెపి మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం నాదర్‌గుల్‌లోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్పొరేషన్‌లో పార్కు స్థలాల కబ్జాలకు సంబంధించి ఎలాంటి విచారణ గానీ జరపకపోవడం.. బాధ్యులపై చర్యలు గానీ తీసుకోని వైనంపై ప్రశ్నల పరంపరను సంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ లో దాదాపు రూ.40 కోట్ల విలువ చేసే సుమారు 11,500 గజాల ఓపెన్ స్థలాలు కబ్జాకు గురయ్యాయనీ వాటిపై విచారణ జరిపించి సదరు స్థలాలను ప్రజలకు ఉపయోగపడేటట్లు చేయాలని గడచిన 12 నెలల కాలంలో 23 వినతి పత్రాలను సమర్పించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్, సిడిఎంఎ, బాలానగర్ రిజిస్ట్రార్ ఆఫీస్, చంపాపేట్ సబ్ రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ ఐజి ఆఫీస్, బడంగ్‌పేట్ కమీషనర్లతో పాటు అప్పటి బడంగ్‌పేట్ మేయర్‌కు అదే విధంగా మహేశ్వరం ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చామని ఆయన వివరించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో 5100 గజాలు, బాలాజీనగర్‌లో 400 గజాలు, 30వ డివిజన్ ఎంసిఆర్ కాలనీలో 2 వేల గజాలు, 23వ డివిజన్ మారుతీనగర్‌లో 2200 గజాలు, 19వ డివిజన్ గాయత్రీ హిల్స్‌లో 400 గజాలు, 18వ డివిజన్ అయోధ్య కాలనీలో 1600 గజాలు మొత్తం కలిపి 11,500 గజాలు అక్రమణలకు గురయ్యాయనీ వాటిలో యధేచ్ఛగా ప్లాట్ల క్రయ విక్రయాలు జరిగి ఇళ్ల నిర్మాణాలు కూడా జరుగుతున్నట్లు తాను ఆధారాలతో ఫిర్యాదు చేశారని వెంకట్‌రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ ఎలాంటి విచారణ గానీ చర్యలు గానీ ఎవరూ తీసుకోలేదని ఆయన విమర్శించారు. కార్పొరేషన్‌లో బహిరంగంగా యధేచ్ఛగా ఓపెన్ స్థలాల అన్యాక్రాంతంపై అధికారులు ఎప్పుడు విచారణ జరిపించి చర్యలు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుండి విడిపించే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్టార్ -2 అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు రాంరెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్‌లతో పాటు శశివర్ధన్‌రెడ్డి, రాంబాబు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.